సాక్షి
కుమురం భీం
ఆదివారం । 3 । మార్చి । 2024



ఈద్‌గాం ఠాణా ఎదుట ధర్నా
మహిళ మృతికి కారకుడిని అరెస్ట్ చేయాలని ఈద్‌గాం ఠాణా ఎదుట ఆమె కుటుంబీకులు ధర్నా చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. 8లో▸



గృహజ్యోతి జీరో బిల్లుల పంపిణీ
గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. వినియోగదారులకు విద్యుత్ సిబ్బంది జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /23.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే 2024 టీఎస్ఆర్జీసీ సెట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసిఫాబాద్ టీటీడబ్ల్యూఆర్డీసీ (బాలికలు) కళాశాల ప్రిన్సిపాల్ శారద శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. అర్హత పరీక్ష ఏప్రిల్ 28వ తేదీన నిర్వహించనున్నట్లు వివరించారు. అర్హతగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మోదీ సభ సక్సెస్ చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 4వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్న ప్రధాని మోదీ హాజరయ్యే బీజేపీ బహిరంగసభ విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, నాయకులు సుచిత్, సూర్యప్రకాశ్, శ్రవణ్‌గౌడ్, సప్త శ్రీనివాస్, గణేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న రాజేందర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు జీవో 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, వారానికి ఒకరోజు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పెరిక శ్రీకాంత్, అధ్యక్షుడిగా మట్ల రాజు, కార్యదర్శిగా తోట సమ్మయ్య, కోశాధికారిగా బాపురావ్, సహకార కార్యదర్శులుగా ప్రభాకర్, ఇస్తారు, శంకర్, లక్ష్మి, ఉపాధ్యక్షులుగా శంకర్, శ్రీనావాస్, రాజు, సాగర్ ఎన్నికయ్యారు.

లైబ్రరీ పీరియడ్ తప్పనిసరి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీ పాఠశాలలో గ్రంథాలయ పీరియడ్ తప్పనిసరిగా నిర్వహించి విద్యార్థులకు పుస్తకపఠనంపై ఆసక్తి పెంచాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ సూచించారు. శనివారం జిల్లాలోని 150 ప్రాథమిక, 96 ప్రాథమికోన్నత, 20 ఉన్నత పాఠశాలలకు సంబంధించి నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తకాలు, కథల కార్డులు, గ్రాఫిక్స్‌కు చెందిన వివిధ రకాల లైబ్రరీ పుస్తకాలు, ఇతర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో ప్రాథమిక పాఠశాలకు 261, ప్రాథమికోన్నత పాఠశాలకు 381 పుస్తకాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

సహాయకేంద్రం ఏర్పాటు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ భుజంగ్‌రావ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల్లో మార్పులుంటే కేంద్రానికి వచ్చి సరిచేసుకోవచ్చని సూచించారు.

ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయ నాలుగోవార్షికోత్సవం సందర్భంగా శనివారం అర్చకులు నరేశ్‌శర్మ, మధూకర్‌శర్మ, సూర్యనారాయణశర్మ, మహేశ్‌శర్మ, విజయ్ కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. హోమం, వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. అర్చకులను సన్మానించారు. ఈవో వేణుగోపాల్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ మనోజ్, రాజేశ్వర్‌మసాదే, సుగుణాకర్, ప్రదీప్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

అగ్గి అంటుకుందా.. అంతే!

- 15 మండలాలు.. రెండే ఫైర్‌స్టేషన్లు
- అగ్నిప్రమాదం జరిగితే అంతే సంగతి
- సకాలంలో చేరని ఫైరింజన్ వాహనం
- శిథిలావస్థలో ఆసిఫాబాద్ భవనం
- కాగజ్‌నగర్‌లో సొంత భవనం కరువు
- కౌటాలలో ప్రతిపాదనలకే పరిమితం



కాగజ్‌నగర్‌లో శిథిల పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న ఫైర్‌స్టేషన్

దహెగాం: జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ వచ్చే లోపు జరగాల్సిన నష్టం జరుగుతోంది. జిల్లాలో రెండు చోట్ల మాత్రమే ఫైర్‌స్టేషన్లు ఉండగా ఫైరింజన్లు సకాలంలో ప్రమాదం జరిగిన ప్రాంతాలకు చేరుకోలేకపోతున్నాయి. ఫలితంగా బాధితులకు బూడిదే మిగులుతోంది. జిల్లాలో 15 మండలాలు ఉండగా.. 334 గ్రామపంచాయతీలున్నాయి. జిల్లా మొత్తం విస్తీర్ణం 4,879 చదరపు కిలోమీటర్లు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో ఫైర్ స్టేషన్లు ఉండగా రెండు ఫైరింజన్లు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఫైర్‌స్టేషన్ సుమారు 70కిలోమీటర్ల దూరంలోని గ్రామాలను చేరుకోవాల్సి ఉంది. దూరభారం కారణంగా ప్రమాదాలు జరిగినపుడు సకాలంలో ఫైరింజన్లు చేరుకోలేక పోతున్నాయి. జైనూర్, కౌటాలలో ఫైర్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ప్రతిపాదనలకే పరిమితమైంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో రెండుచోట్ల ఫైర్‌స్టేషన్లు ఉండగా జిల్లా ఫైర్ అధికారి మంచిర్యాల, ఆసిఫాబాద్ డివిజన్ స్థాయిలో రెండు జిల్లాలకు ఒకే అధికారి కొనసాగుతున్నారు. ఐదుగురు ఫైర్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆసిఫాబాద్‌లో నలుగురు, కాగజ్‌నగర్‌లో నలుగురు ఫైర్ కానిస్టేబుళ్లను ప్రభుత్వం భర్తీ చేసింది. కానీ.. వారి శిక్షణ ఇంకా పూర్తి కాలేదు. ఆసిఫాబాద్ ఫైర్‌స్టేషన్‌ను శిథిల భవనంలో నిర్వహిస్తుండగా వానాకాలంలో ఉరుస్తోందని సిబ్బంది వాపోతున్నారు. కాగజ్‌నగర్‌లో పక్కాభవనం లేదు. ఇక్కడ నలుగురు సిబ్బంది మాత్రమే ఉండగా ఆరు ఖాళీలున్నాయి. డ్రైవర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. అగ్నిప్రమాదాల నివారణకు జిల్లా ప్రజలకు అవగాహన కల్పించే పరిస్థితి లేదు. గత రెండేళ్లలో జరిగిన అగ్నిప్రమాదాల కారణంగా భారీగా ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలు

గతేడాది మార్చి నుంచి 2024 ఫిబ్రవరి నెలాఖరు వరకు ఆసిఫాబాద్ ఫైర్‌స్టేషన్ పరిధిలో 25 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో రూ.98లక్షల ఆస్తి నష్టం జరగగా, ఫైర్ సిబ్బంది రూ.2.49 కోట్ల ఆస్తిని రక్షించగలిగారు. కాగజ్‌నగర్ పరిధిలో 22 ప్రమాదాలు జరగగా రూ.22.29లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఫైర్ సిబ్బంది రూ.27.6లక్షల ఆస్తిని కాపాడగలిగారు.

దూరభారం.. బాధితులకు శాపం

ఆసిఫాబాద్ ఫైర్‌స్టేషన్ పరిధిలో కెరమెరి, జైనూర్, వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, లింగాపూర్, సిర్పూర్ (యూ) మండలాలున్నాయి. వీటిలో పలు గ్రామాలు జిల్లా కేంద్రానికి సుమారు 50నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కాగజ్‌నగర్ ఫైర్‌స్టేషన్ పరిధిలో సిర్‌పూర్(టీ), దహెగాం, పెంచికల్‌పేట్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలున్నాయి. కాగజ్‌నగర్ నుంచి పలు గ్రామాలు సుమారు 70కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో సమయానికి చేరుకోక పోవడంతో జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఆసిఫాబాద్‌లో ఫైర్‌స్టేషన్‌కు పక్కా భవనం ఉన్నా శిథిలావస్థకు చేరింది. కాగజ్‌నగర్‌లో శిథిలావస్థలోని పాత పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించినా ఇక్కడ పక్కా భవనం నిర్మించడం లేదు. నీటి సౌకర్యం కూడా లేక పోవడంతో ఎస్పీఎంలోకి, ఇటుక బట్టీల వద్దకు వెళ్లి నీరు నింపుకోవాల్సిన పరిస్థితి. ఇక్కడ కనీస వసతులు కూడా లేవు. దీంతో సిబ్బందికి ఇబ్బంది తప్పడంలేదు.

ప్రమాదాల నివారణకు ఇవీ.. జాగ్రత్తలు

అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ అధికారులు అందిస్తున్న సూచనలు..

- ఇంటి ఆవరణలో గడ్డివాములు పెట్టకూడదు. కరెంట్ తీగల కింద అసలే వద్దు.
- గడ్డి కుప్పల వద్ద మంట పెట్టరాదు.
- బీడీ, సిగరెట్ తాగేవారు పీకలను చెత్తకుప్పల వద్ద వేయరాదు.
- ఇళ్లలో రాత్రి దీపాలు వెలిగించరాదు.
- ఇళ్లు, గుడిసెల్లో నాణ్యమైన విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- గ్యాస్‌స్టౌ వద్ద కాలే వస్తువులు ఉంచరాదు. పెట్రోల్, కిరోసిన్ అసలే ఉంచొద్దు. స్టౌ పైపు ప్రతీ ఆరునెలలకోసారి మార్చాలి.
- గ్యాస్‌స్టౌ పైపు ఐఎస్ఐ మార్కు ఉన్నదే వాడాలి.
- గ్యాస్‌లీక్ కాకుండా రెగ్యులేటర్‌ను తరచూ గమనిస్తూ ఉండాలి.
- గ్యాస్‌స్టౌ వినియోగిస్తున్నపుడు కిటికీలు తెరిచి ఉంచాలి.
- బైక్‌లు ఎండలో పెట్టవద్దు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయి. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లలో పత్తి నిల్వలు, ఇంటికి ఆనుకుని గడ్డివాములు ఉంచరాదు. ఆసిఫాబాద్‌లోని అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరింది. కాగజ్‌నగర్‌లో పక్కా భవనం లేకపోవడం, నీటి వసతి లేని మాట వాస్తవమే. జిల్లాలో జైనూర్, కౌటాల మండలాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. ప్రమాదాలు జరిగినప్పుడు ఆసిఫాబాద్ ఫైర్‌స్టేషన్‌ను 8712699190, కాగజ్‌నగర్ ఫైర్‌స్టేషన్‌ను 8712699192 నంబర్లలో సంప్రదించాలి.

– అజయ్‌కుమార్, డివిజన్ ఫైర్‌అధికారి

నూతన కలెక్టర్‌గా వెంకటేశ్ దోత్రే



సాక్షి, ఆసిఫాబాద్: నాలుగు రోజులుగా కలెక్టర్‌గా ఎవరు బాధ్యతలు తీసుకోనున్నారనే సందేహాలకు తెర పడింది. బుధవారం ఐఏఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో ఇక్కడి కలెక్టర్ హేమంత్ బోర్కడేను హైదరాబాద్ జీహెచ్ఎంసీకి అదనపు కమిషనర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. అతడి స్థానంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న స్నేహ శబరీశ్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు స్నేహ శబరీశ్ ఆసక్తి చూపకపోవడంతో కొత్త కలెక్టర్ ఎవరు వస్తారన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఓ వైపు కలెక్టర్ బదిలీ కావడం, మరో వైపు అదనపు కలెక్టర్లుగా పని చేసిన ఇద్దరు అధికారులు ఎన్నికల శిక్షణకు వెళ్లడంతో మూడురోజులుగా జిల్లాకు పెద్ద దిక్కు లేకుండా పోయింది. వీఆర్వో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా కొత్త కలెక్టర్ రాకపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం జిల్లాకు ఐఏఎస్ అధికారి వెంకటేశ్ దోత్రేను కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నాటక రాష్ట్రం బెళగాం ప్రాంతానికి చెందిన వెంకటేశ్ దోత్రే పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం బెళగాంలోనే పూర్తి చేశారు. అనంతరం బెంగళూరులోని పీఈఎస్ఐటీలో 2006–10 మధ్య ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ పట్టా పొందారు. ఇంజినీరింగ్‌లో 82.53శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. తర్వాత బెంగళూరులోని ఇట్టికాం సిస్టమ్స్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఏడాది మూడు నెలల పాటు పని చేశారు. అనంతరం యూపీఎస్సీ పరీక్షల కోసం ఢిల్లీ వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. మూడో ప్రయత్నంలో ఆయన 2017లో ఐఏఎస్ సాధించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పని చేస్తున్నారు. పదోన్నతిపై ఇక్కడికి వస్తున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

'కక్షపూరిత వైఖరి సరికాదు'


గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

వాంకిడి: అటవీశాఖ అధికారులు కొలాం ఆదివాసీలపై కక్ష పూరితంగా వ్యవహరించడం దుర్మార్గపు చర్య అని కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు, కార్య నిర్వాహక అధ్యక్షుడు సీడం అన్నిగా పేర్కొన్నారు. శనివారం మండలంలోని రింగారేట్ గ్రామాన్ని కొలాం సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల కాగజ్‌నగర్ మండలంలోని దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులులపై విషప్రయోగం చేసి చంపారన్న నెపంతో రింగారేట్ గ్రామానికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేయగా ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారని తెలిపారు. కానీ.. అటవీశాఖ అధికారులు హైకోర్టులో సవాల్ చేసి బెయిల్ రద్దు చేయించి మళ్లీ అరెస్ట్ చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇది కక్ష పూరితంగా చేసిన చర్యగా ఖండిస్తున్నామని తెలిపారు. పులులను హతమార్చిన ఘటనలో నిందితులుగా భావిస్తున్న రింగారేట్‌కు చెందిన కోవ గంగు, ఆత్రం జల్‌పత్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విచారణ పేరిట కొలాం గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఆయన వెంట కొలాం సంఘం రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆత్రం తిరుపతి, నాయకులు ఆత్రం జల్పత్‌రావు, కుమురం సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో సక్సెస్ చేయాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

ఆసిఫాబాద్‌అర్బన్: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లాలో 57,362 మంది 0–5 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించామని పేర్కొన్నారు. వీరి కోసం 22 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో 80వేలకు పైగా వ్యాక్సిన్ డ్రాప్స్ సిద్ధం చేసినట్లు చెప్పారు. చుక్కల మందు వేసేందుకు 672 కేంద్రాల్లో 1,700 మందికి పైగా సిబ్బంది 80 రూట్లకు వెళ్లి వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. పోలియో చుక్కలు వేసేందుకు బస్టాండ్లు, రైల్వేస్టేషన్, ముఖ్య రద్దీ కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 78 మంది సూపర్‌వైజర్లు, 33 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం అన్ని ముఖ్య కూడళ్లలో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలియో రహిత సమాజం కోసం చేపడుతున్న కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ప్రోగ్రాం అధికారి సిద్దార్థ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


కెరమెరి: హట్టిలో విద్యార్థితో చదివిస్తున్న పద్మ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ టీసీఆర్, టీఐ అడిషనల్ డైరెక్టర్ ప్రత్యేకాధికారి పద్మ ఉపాధ్యాయులకు సూచించారు. గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఆదేశానుసారం శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను ఉప సంచాలకులు రమాదేవితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షత్రయ్య, హెచ్ఎం నారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హట్టి, మోడిలో పాఠశాలల్లో..

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని హట్టి, మోడి ఆశ్రమ పాఠశాలలను గిరిజన సంక్షేమశాఖ టీసీఆర్, టీఐ అడిషనల్ డైరెక్టర్ ప్రత్యేకాధికారి పద్మ శనివారం డీడీ రమాదేవితో కలిసి సందర్శించారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తీర్ణత పెంపునకు తీసుకుంటున్న కార్యాచరణపై సమీక్షించారు. ఆయన వెంట ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో పురుషోత్తం, హెచ్ఎంలు ప్రేందాస్, స్వర్ణలత, ఉపాధ్యాయులున్నారు.

సిట్టింగ్.. పెండింగ్!

- బీజేపీ తొలి జాబితాలో 'సోయం'కు నో ఛాన్స్
- ఆదిలాబాద్ ఎంపీ సీటుపై ఉత్కంఠ
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ



కైలాస్‌నగర్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అధిష్టానం తొలివిడత జాబితాను శనివారం ప్రకటించింది. ఇందులో తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. సిట్టింగ్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావు పేరును ప్రకటించకపోవడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. సోయం పేరును ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టడం వెనుక అంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక్కడి నుంచి బరిలో నిలిచేందుకు పలువురు అభ్యర్థులు పోటీ పడుతుండగా బాపూరావు మాత్రం ఇంకా తనకే టికెట్ వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ వెనుక మతలబు ఏంటో..

ప్రధానమంత్రి మోదీ ఆదిలాబాద్ పర్యటన సోమవారం ఖరారైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాతో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలందరి దృష్టి పీఎం సభపైనే కేంద్రీకృతమై ఉంది. పార్టీ అభ్యర్థుల తొలి జాబితాలో భాగంగా ఆదిలాబాద్ అభ్యర్థిని కూడా ప్రకటించి మోదీ ఎన్నికల ప్రచారానికి ఇక్కడి నుంచే శ్రీకారం చూడతారనే ప్రచారం సాగింది. అయితే అధిష్టానం మాత్రం ఈ టికెట్ విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో సిట్టింగ్ ఎంపీలుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌కు మరోసారి అవకాశం కల్పించగా ఆదిలాబాద్ ఎంపీ సోయం పేరును మాత్రం పెండింగ్‌లో పెట్టడం ఆసక్తి కలిగిస్తోంది. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైనప్పటికీ దేశంలో నడుస్తున్న మోదీ మేనియాతో ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. తమకు అవకాశం కల్పించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దరఖాస్తు కూడా చేసుకున్నారు. కొంతమందైతే తమకే టికెట్ వస్తుందనే నమ్మకంతో ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారానికి కూడా శ్రీకారం చుట్టారు. ఈ పరిస్థితుల్లో సోయం పేరును ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టడం వెనక మతలబు ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ వర్గాల్లో చర్చ

కమలం పార్టీ ప్రకటించిన తొలి విడత జాబితాలో సోయంకు చోటు దక్కకపోవడంపై పార్టీ శ్రేణులతో పాటు రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. పార్టీ అధిష్టానం మదిలో ఏముందోననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదిలాబాద్ టికెట్‌కు తీవ్ర పోటీ ఉండటంతోనే ఆయన పేరు ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టారనే టాక్ నడుస్తోంది. ఆయన స్థానంలో కొత్త అభ్యర్థినెవరినైనా బరిలోకి దింపుతారా అనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారు. మోదీ రాక నేపథ్యంలో ఇదివరకు ఎంపీగా పనిచేసిన ఓ నాయకుడు బీజేపీలో చేరుతారనే ప్రచారం కూడా సాగుతోంది. అలాగే మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కూడా తనదైన శైలిలో టికెట్ కోసం తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎవరికైనా ఒకరికి టికెట్ కేటాయిస్తారా? లేక ఈ దఫా కొత్త వారిని తెరపైకి తెస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు మలి విడతలో తన పేరు తప్పకుండా ఉంటుందని సోయం అధిష్టానంపై నమ్మకంతో ఉన్నారు. ఏం జరుగుతుందనేది మోదీ సభ అనంతరం తెలిసే అవకాశముంది.

'విశ్వకర్మ'ను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

దహెగాం: బీసీ సామాజికవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశ పెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ అధ్యక్షతన ఓబీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించగా, సత్యనారాయణ హాజరై మాట్లాడారు. విశ్వకర్మ పథకంలో సందేహాలను నివృత్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పాటుపడుతోందని తెలిపారు. పీఎం మోదీ దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకన్న, నాయకులు నారాయణ, తిరుపతిగౌడ్, ప్రభాకర్‌గౌడ్, సురేశ్, సురేశ్, మల్లేశ్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న పోలీస్, ప్రెస్ టీం సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఏడు జట్లు పాల్గొన్నాయి. వీటిలో ఎస్పీ–11, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ పోలీస్ టీమ్, స్పెషల్ పార్టీ పోలీస్ టీమ్, ఆర్ఏఎఫ్ (ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్) టీమ్, ప్రెస్‌క్లబ్ టీం, ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పోలీస్ టీమ్, కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పోలీస్ టీం పాల్గొన్నాయి. తొలిరోజు నిర్వహించిన పోటీల్లో ఎస్పీ టీంతో ప్రెస్‌క్లబ్ టీం తలపడగా ఎస్పీ జట్టు 57 పరుగులతో విజయం సాధించింది. మొదటి మ్యాచ్‌లో ఎస్పీ టీమ్, ప్రెస్ క్లబ్ టీమ్ తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఎస్పీ–11 జట్టు నిర్ణీత 10 ఓవర్లకు రెండు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రెస్ జట్టు 10 ఓవర్లకు ఏడు వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేయగా ఎస్పీ జట్టు 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఎస్పీ సురేశ్‌కుమార్ బ్యాటింగ్ చేసి జట్టులో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు ఆహ్లాదంగా గడిపేందుకు ప్రత్యేకంగా ఈ మ్యాచ్ నిర్వహించామని తెలిపారు. సెమీఫైనల్స్‌లో స్పెషల్‌పార్టీతో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన స్పెషల్‌పార్టీ టీమ్ ఎనిమిది ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. ఆసిఫాబాద్ సబ్ డివిజన్ టీం నిర్ణీత ఎనిమిది ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి '0' పరుగులు చేయగా, స్పెషల్ పార్టీ టీమ్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం ఫైనల్‌లో ఎస్పీ 11 టీమ్‌తో స్పెషల్ పార్టీ టీమ్ పోటీ పడనుంది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

క్లుప్తంగా

బైక్ చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ కొంతం తిరుపతిరెడ్డికి చెందిన బైక్ శనివారం చోరీకి గురైంది. ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు బైక్ చోరీకి గురైన పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారు. కాగా పోలీసులు కేసు నమోదు చేయక పోవడం గమనార్హం.

చికిత్స పొందుతూ యువతి మృతి


నవనీత(ఫైల్)

బెజ్జూర్: గతనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మండలంలోని ఇందిర్‌గాం గ్రామానికి చెందిన కావుడె నవనీత (19) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఫిబ్రవరి 21న పురుగుల మందుతాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు బెజ్జూర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స అందించగా గురువారం ఇంటికి తీసుకువచ్చారు. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మృతి చెందింది. మృతురాలి తండ్రి దేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం


ప్రమాదంలో కాలిపోయిన పత్తి

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని జీవీపీ ఆగ్రో జిన్నింగ్ మిల్లులో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో పత్తి జిన్నింగ్ చేస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు పత్తిపై పడటంతో ప్రమాదం జరిగింది. వెంటనే అక్కడ పని చేస్తున్న సిబ్బంది అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తం అయిన సిబ్బంది మంటలు చెలరేగకుండా చర్యలు తీసుకోవడంతో ఎక్కువగా నష్టం వాటిల్లలేదని మిల్లు యాజమాని గాదె అవినాష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీసీఐ అధికారులు, ఎస్సై సాగర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ప్లాంటు మూత.. బకాయిలు రాక..

- ఆందోళనలో 'శాలివాహన' కార్మికులు
- 15 నెలలుగా బకాయిల కోసం ఎదురుచూపు
- 32 రోజులుగా నిరాహారదీక్ష


నిరాహారదీక్ష చేస్తున్న శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: తమకు రావాల్సిన 15 నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికులు 32 రోజులుగా నిరాహారదీక్ష చేపడుతున్నారు. 2002లో పాతమంచిర్యాల శివారులోని రంగపేటలోని 40 ఎకరాల స్థలంలో గ్రీన్ ఎనర్జీ బయోమాస్ పవర్ ప్లాంట్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన మల్కకొమురయ్య పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. 2002 డిసెంబర్ 6న విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. కంపెనీలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు కలిపి సుమారుగా 400 మంది కార్మికులు ఉపాధి పొందేవారు. ఆ సమయంలో ప్లాంట్‌లో 100 మంది కార్మికులు కేవలం రోజుకు 60 రూపాయల వేతనంతో పని చేసేవారు. 2022 నాటికి కార్మికుల వేతనం రూ.20 వేలకు చేరింది. కంపెనీ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ఇరవై సంవత్సరాలు. 2022 లో అగ్రిమెంట్ రెన్యూవల్ కాకపోవడంతో డిసెంబర్ 6న కంపెనీ యాజమాన్యం పవర్ ప్లాంట్‌ను మూసివేసింది. కానీ కార్మికులకు రావాల్సిన కంపెనీ క్లోజింగ్ బెనిఫిట్స్, వేతనాలు చెల్లించకుండా 15 నెలలుగా యాజమాన్యం కాలయాపన చేస్తోంది. తమ బకాయిలు చెల్లించాలని కార్మికశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేసినా యాజమాన్యంలో చలనంరావడంలేదని కార్మికులు వాపోతున్నారు.

నష్టాల పేరుతో కంపెనీ మూత

నష్టాల పేరుతో కంపెనీ మూసివేయాల్సి వచ్చిందని యాజమాన్యం కట్టుకథలు చెబుతోందని కార్మికులు పేర్కొంటున్నారు. గడువుతీరిన విత్తనాలకు, వాడేసిన కొబ్బరిబోండాలకు ఎలాంటి ఖరీదు లేదని వరిఊకకు మాత్రం డిమాండ్‌ను బట్టి ఖరీదు చెల్లించేవారని కార్మికులు పేర్కొంటున్నారు. కంపెనీ వ్యర్థాలుగా వచ్చిన బూడిదను టన్నుకు రూ.2వేల చొప్పున ఇటుక బట్టీలకు అమ్ముకునేవారన్నారు. ప్లాంట్ ఏర్పాటు సమయంలో కంపెనీలో శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని చెప్పి అక్కడి రైతుల నుంచి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పంట భూములు కొనుగోలు చేసిందని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరాకు రూ.4 కోట్లు పలుకుతుండడంతో సదరు కంపెనీ యాజమాన్యం అట్టి భూముల్ని అమ్ముకుని కార్మికులకు ఎంతోకొంత ముట్టజెప్పి వదిలించుకోవాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కంపెనీ లాకౌట్ ప్రకటిస్తున్నామని వందరోజులు ముందుగానే ప్రభుత్వానికి, కార్మికులకు నోటీసుల ద్వారా తెలపాల్సి ఉంది. కానీ అవేం చేయకుండా పవర్‌పర్చేజ్ అగ్రిమెంట్ రావడం లేదని అబద్ధాలు చెప్తూ కాలం గడిపారన్నారు. ప్లాంట్ నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి సబ్సిడీలు పొంది చవకగా వచ్చిన భూములను అధికధరలకు అమ్ముకుందామనే దురాలోచనతోనే ఉన్నారని ఆరోపిస్తున్నారు. తమకు రావాల్సిన వేతనాలు, బకాయిలను చెల్లించేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

ఉద్యమాన్ని కొనసాగిస్తాం



మాకు భవిష్యత్ ఉంటుందనే నమ్మకంతో ఇరవై ఏళ్లుగా తక్కువ వేతనానికి పనిచేశాం. అర్ధాంతరంగా ప్లాంట్ మూసివేతకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. వారికి రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు కొట్లాడుతాం. డైరెక్టర్ల ఇళ్లను ముట్టడిస్తాం.

– కుంటాల శంకర్, పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు

ఉద్యోగాలు వస్తాయని..



మాకు కంపెనీలో ఉద్యోగాలు వస్తాయనే ఆశతోనే విలువైన భూములను తక్కువ ధరకు ప్లాంట్ నిర్మాణం కోసం అప్పగించాం. ఇప్పుడు అర్ధాంతరంగా కంపెనీ మూసివేసి మాకు ఎలాంటి ఉపాధి లేకుండా చేశారు. మా భూములు మాకు అప్పగిస్తే వ్యవసాయం చేసుకునైనా బతుకుతం.

– నిమ్మరాజుల సత్యనారాయణ, పవర్ ప్లాంట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

కార్మికులు రక్షణతో పనిచేయాలి


భవనాన్ని ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తి, రవాణాలో కార్మికులు రక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సీహెచ్‌పీ వద్ద రూ.50 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులకు పాలనాపరమైన సౌలభ్యం కోసం ఈ భవనం నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, గని మేనేజర్ సుధీర్, సంక్షేమాధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వోటూ జీఎంగా పురుషోత్తంరెడ్డి

శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎంగా పురుషోత్తంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారిగా ఉన్న ఆయన ఇటీవల ఇక్కడికి బదిలీ అయ్యారు.

రికార్డులు కొనసాగించాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఉత్పత్తి లక్ష్య సాధనలో ఆర్కే 6 గని రికార్డులను నమోదు చేసుకుంటుందని, దీనిని ఇలాగే కొనసాగించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఈ ఏడాది వార్షిక లక్ష్యాన్ని ఆర్కే 6 గని 30 రోజుల ముందుగానే సాధించింది. ఈ సందర్భంగా శనివారం గనిపై ఏర్పాటు చేసిన అభినందన సభకు జీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఫిబ్రవరి 29 నాటికే 1,80,000 టన్నుల వార్షిక లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమన్నారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ ఈ.తిరుపతి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బాజీసైదా, ముస్కె సమ్మయ్య, సంఘం సదానందం పాల్గొన్నారు.

'జయంతి వేడుకలు దురదృష్టకరం'

శ్రీరాంపూర్: మాజీ స్పీకర్, దివంగత నేత శ్రీపాదరావు జయంతి వేడుకలను సింగరేణి యాజమాన్యం నిర్వహించడం దురదృష్టకరమని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్కే బాజీసైదా, డెప్యూటీ జనరల్ సెక్రటరీలు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీపాదరావుకు సింగరేణికి ఎలాంటి సంబంధం లేదన్నారు. సింగరేణిలో ఎప్పుడు లేని సంప్రదాయాలను నేడు మొదలు పెట్టారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. సింగరేణి యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలను రద్దు చేయాలని, లేని యెడల కార్మిక వర్గం నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు.

మహిళలకు క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న సాయంత్రం 5 గంటలకు నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, సాయంత్రం బంగ్లా ఏరియాలోని ఇల్లందు క్లబ్ వద్ద బాల్ ఇన్ బాస్కెట్, పాసింగ్ బాల్, బాంబ్ బ్లాస్ట్ పోటీలు, 5న సాయంత్రం 5 గంటలకు శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి మైదానంలో బాంబ్ బ్లాస్ట్ పోటీలు, 6న సాయంత్రం 4 గంటలకు జీఎం కార్యాలయంలో ఇవే పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న తిలక్

చెన్నూర్: కత్తితో పొడుచుకుని యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ తెలిపిన వివరాల మేరకు కోటపల్లి మండలం శంకర్‌పూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాండ్ర తిలక్ (27) శనివారం సాయంత్రం చెరువుకట్ట ప్రాంతంలో ఆటో నిలిపి కడుపులో కత్తితో పొడుచుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం మంచిర్యాలకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా సదరు యువకుడి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియలేదన్నారు. ఇప్పటి వరకు తిలక్ బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

శ్రీరాంపూర్‌లో 107 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనులు ఫిబ్రవరి మాసంలో 107 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో 5.25 లక్షల టన్నులు నిర్దేశించగా 5.62 లక్షల టన్నులు సాధించామన్నారు. ఏప్రిల్ 1, 2023 నుంచి ఇప్పటి వరకే నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 60.22 లక్షల టన్నులకు గానూ 52.22 లక్షల టన్నులు సాధించామన్నారు. దీంతో 86 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. అన్ని గనుల్లో కెల్లా ఆర్కే 6 గని బొగ్గు ఉత్పత్తిలో ముందుందన్నారు. 30 రోజులు ముందే వార్షిక లక్ష్యాన్ని సాధించారన్నారు. కంపెనీ ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీన్ని సాధించాలంటే రోజువారీగా 2.27 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..


ట్రాక్టర్‌తో కూల్చివేస్తున్న ఇంటి పునాది

బెల్లంపల్లి: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేయించారు. భూకబ్జాలు శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్డీవో హరికృష్ణ అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు రడగంబాల బస్తీకి వెళ్లి సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల పునాదులు, గుడిసెల ను ట్రాక్టర్‌తో కూల్చివేయించారు. ఈ క్రమంలో కొందరు అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు నిలువరించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకుంటాం

బెల్లంపల్లిలో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకుంటామని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులతో రెండు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రెండు, మూడు రోజుల వ్యవధిలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయో గుర్తించి నిర్మాణాలను కూల్చివేయిస్తామన్నారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

పాముకాటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

జైనూర్(ఆసిఫాబాద్): పాము కాటుతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏపీవో నగేష్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని దుబ్బగూడకు చెందిన పెందూర్ రామారావు (50) ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పాము కాటు వేయడంతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి


రిషికుమార్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): విద్యుత్ షాక్‌తో బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన చౌదరి సరిత, సోమయ్య దంపతుల కుమారుడు రిషికుమార్ (4) శనివారం మధ్యాహ్నం అతని తల్లి ఇంట్లోనే బోరువద్ద బట్టలు ఉతుకుతుండగా అక్కడే ఆడుకుంటున్నాడు. బోరుకు ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన బాలుడి తల్లి వెంటనే బోరు మోటార్ ఆపేయడంతో బాలుడు ఎగిరిపడి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆసిఫాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తల్లి సరిత ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యమే కారణమా?

బోరు వద్ద గతంలోనూ చిన్నపాటి విద్యుత్‌షాక్ తగిలిన సంఘటనలు చోటు చేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. బోర్ మోటార్‌కు రిపేర్ చేయించడంతో చేసిన జాప్యానికి బాలుడు బలి అయినట్లు తెలుస్తోంది.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని దంతన్‌పల్లి సెక్షన్‌లో శనివారం అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కౌడన్ మొవాడ్ నుండి ఆసిఫాబాద్ వైపు వస్తున్న టాటా ఇండికా కారులో అక్రమంగా కలప తరలిస్తుండగా డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్ తన టీంతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. తనిఖీల్లో 11 కలప దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కలప విలువ సుమారు రూ.67వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో మురళీగూడ సెక్షన్ అధికారి మహేందర్, బీట్ అధికారులు రాజేశ్, అనీల్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలలుగా ఒకటో తేదీనే జీతాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పొందు పరచిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రెండు నెలలుగా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని టీఎన్జీవో అటవీశాఖ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పొన్న మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2019 అక్టోబర్ 1న జీతాలు అందుకున్న ప్రభుత్వ ఉద్యోగులు ఇన్నాళ్లకు మార్చి 1వ తేదీతో రెండు నెలలుగా జీతాలు అందుకుంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, 317 జీవో భాధితుల సమస్యలను పార్లమెంట్ ఎన్నికలకు ముందే పరిష్కారం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఫోరం ఉపాధ్యక్షుడు రత్నరవికిరణ్‌రెడ్డి, కార్యదర్శి వెంకటక్రిష్ణ, కుమురం అభిషేక్, ప్రకాశ్‌నాయక్, అబ్దుల్ కరీం ప్రకటనలో పేర్కొన్నారు.

'పెద్దపల్లి సీటు నేతకానీలకు ఇవ్వాలి'


మాట్లాడుతున్న ఏమాజీ

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ సీటును నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఆ పార్టీ అధిష్టానాన్ని కోరారు. శనివారం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఈసారి తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నేతకాని కులస్తుడైన తనకు సీటు కేటాయిస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ శశిధర్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణానికి చెందిన ఎస్కే అభిహైమద్ మూడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. మందమర్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. శనివారం బాధితుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ శశిధర్, ఎస్సై రాజశేఖర్ సెల్‌ఫోన్ అప్పగించారు.

ఈజ్‌గాం ఠాణా ఎదుట ధర్నా

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని మండువ గ్రామానికి చెందిన కమ్మరి రోజా రెండురోజుల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందగా, ఆమె కుటుంబీకులు శనివారం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ స్టేట్ కన్వీనర్ శైలజాగౌడ్ మాట్లాడారు. రోజా మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు స్థానిక ప్రజాప్రతినిధి బంధువు కావడంతోనే కేసు తప్పుదోవ పట్టించి అతడిని కాపాడేయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు గురై కేసును నీరుగారిస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా, కేసు విచారణ కొనసాగుతున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: 2024–25 విద్యాసంవత్సరానికి గానూ హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్ (ఇంగ్లిష్ మీడియం)లో 1వ తరగతిలో ప్రవేశంకోసం నిరుపేద గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోండు, నాయక్‌పోడ్, కొలాం–పీటీజీ, కోయ, సుగాలీ, లంబాడా, ఇతర గిరిజన విద్యార్థుల్లో ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను లక్కీడిప్ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు మించి ఉండరాదన్నారు. అభ్యర్థులు జూన్ 1, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 11న సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ధ్రువీకరణపత్రాలు అందజేయాలన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి ముఖేష్

భీమిని(బెల్లంపల్లి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముఖేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి సమస్య ఉన్నా మండల లీగల్ కౌన్సిలింగ్ అథారిటీ, బెల్లంపల్లి కోర్టుకు పోస్టుకార్డు ద్వారా ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ భీకరణదాస్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్, సీనియర్ న్యాయవాదులు గోపికిషన్ సింగ్, అశోక్, ఎస్సై ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని న్యాయమూర్తి ముఖేష్ అన్నారు. కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు చూపించాలని ప్రత్యేకాధికారి కవితను అడగగా పాఠశాలలో లేవని చెప్పడంతో ఆశ్చర్యానికి గురై వెంటనే తెప్పించాలని ఆదేశించారు.

11న మత్స్యకారుల సహకార సంఘం ఎన్నికలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 11న జిల్లా మత్స్యకారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి జె.నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నామనేషన్ల స్వీకరణ, 1:30 నుంచి 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, 3:30 నుంచి 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 11న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీలో గల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు.